# చదువు





రోగికి శస్త్రచికిత్స చేయాలంటే మత్తుమందు వైద్యుడు ఎంత ముఖ్యమో.. ఆ మత్తుమందు ఇవ్వడానికి సర్వం సిద్ధం చేసే సాంకేతిక నిపుణుడు కూడా అంతే అవసరం. ఇన్‌ఫెక్షన్లు రాకుండా శస్త్రచికిత్స గదిని శుభ్రంగా ఉంచాలన్నా సహాయకులు కావాల్సిందే. వాళ్లే పారామెడికల్ సిబ్బంది. పారామెడికల్ కోర్సులు చేయడం ద్వారా వీళ్లు ఆ నైపుణ్యాలను పొందుతారు. డాక్టర్లకు అడుగడుగునా అండగా ఉంటూ పేషెంట్లకు సకాలంలో వైద్యసేవలు అందిస్తారు. అందుకే పారామెడికల్ నిపుణులకు డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. ఈ రంగంలో ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోర్సులు వస్తున్నాయి. ఎప్పటికీ తరగని ఉద్యోగావకాశాలను అభ్యర్థులకు అందిస్తున్నాయి.

# పారా కోర్సులు.. చాలా కొలువులు

వైద్యవృత్తిలో సాంకేతిక నిపుణుల పాత్ర గతంలో కంటే ఇప్పుడు మరింత ప్రధానమైంది. రెండు దశాబ్దాల కిందటితో పోలిస్తే వైద్యవృత్తికి సంబంధించిన సాంకేతిక నిపుణుల కోర్సులు ఇటీవలి కాలంలో కొత్తవి పుట్టుకొచ్చాయి. ఒక్కో వైద్యనిపుణుడికి తన విభాగానికి సంబంధించిన సాంకేతిక నిపుణుడి సహకారం ఇప్పుడు అవసరమవుతోంది. ఈ సాంకేతిక నైపుణ్యాన్ని అందించే కోర్సులే 'పారామెడికల్ కోర్సులు'.

దాదాపు 22 రకాల పారామెడికల్ డిప్లొమా కోర్సులు ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఇందులో డిగ్రీ కోర్సులూ, పీజీ డిప్లొమా కోర్సులూ ఉన్నాయి. పారామెడికల్ కోర్సుల్లో ఏ స్థాయి విద్యనభ్యసించినా.. వృత్తిలో కొనసాగాలంటే మాత్రం తప్పనిసరిగా రాష్ట్ర పారామెడికల్ బోర్డులో తమ సమాచారాన్ని నమోదు చేసుకోవాల్సిందే.

2006లో ఉమ్మడి రాష్ట్రంలోనే పారామెడికల్ బోర్డు అనేది ప్రత్యేకంగా ఏర్పాటు కాగా.. దానికి కొనసాగింపుగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక పారామెడికల్ బోర్డులు ఏర్పడ్డాయి.

బీఎస్సీ పారామెడికల్ కోర్సుల ప్రవేశాలను మాత్రం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పరీక్షలు కూడా వారే నిర్వహిస్తారు. డిగ్రీ పూర్తయిన అనంతరం ధ్రువపత్రాల నమోదు ప్రక్రియను మాత్రం పారామెడికల్ బోర్డులోనే చేయించాల్సి ఉంటుంది. అయితే డిప్లొమాలో ఉన్నన్ని భిన్నమైన పారామెడికల్ కోర్సులు.. డిగ్రీలో లేవు.

**అర్హత ఏమిటి?:** ఈ కోర్సులన్నీ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో రెండింటిలోనూ ఉన్నాయి. తెలంగాణలోని 9 ప్రభుత్వ కళాశాలల్లో 13 రకాల పారామెడికల్ డిప్లొమా కోర్సులతో మొత్తం 591 సీట్లుండగా.. 250 ప్రైవేటు కళాశాలల్లో 22 రకాల పారామెడికల్ కోర్సులతో మొత్తం 33456 డిప్లొమా సీట్లున్నాయి. అయితే ప్రైవేటులో సీట్లు భారీగానే ఉన్నా వాస్తవానికి నాలుగో వంతు సీట్లు కూడా భర్తీ కావడం లేదు. 2016-17లో కేవలం 7 వేల మంది పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో పరీక్షలు రాయగా.. 2017-18లో ఆ సంఖ్య స్వల్పంగా పెరిగి 8700 మంది తుది పరీక్షకు హాజరయ్యారు.

ప్రస్తుతం ప్రభుత్వ రంగంలోనూ పారామెడికల్ ఉద్యోగాల ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో ఈ దఫా 2018-19లో తుది పరీక్షలు రాసేవారి సంఖ్య 10 వేలు దాటొచ్చని పారామెడికల్ బోర్డు అంచనా వేస్తోంది.

2012-13కు ముందు ఈ కోర్సుల ప్రవేశానికి అర్హత పదో తరగతి మాత్రమే ఉండేది. కానీ ఆ తర్వాత నుంచి దీనికి కనీస అర్హత ఇంటర్మీడియట్‌గా నిర్ణయించారు. రెండు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లోనూ ఇప్పుడు ప్రవేశం కల్పిస్తున్నారు. ఒక మోస్తరు ఆర్థిక స్థోమత ఉన్నవారు డిగ్రీ పారామెడికల్ కోర్సుల్లో చేరుతుండగా.. పూర్తిగా నిరుపేద విద్యార్థులు, ఆర్థికంగా రుసుములు చెల్లించలేని విద్యార్థులు మాత్రమే డిప్లొమా పారామెడికల్ కోర్సుల్లో చేరుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గతంలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మాత్రమే పారామెడికల్ కోర్సులు చదవడానికి అర్హత ఉండేది. కానీ ఆ తర్వాత కాలంలో ఆర్ట్స్ విద్యార్థులకూ అవకాశాలు కల్పించారు. డిప్లొమా ఇన్ రేడియోథెరపీ టెక్నీషియన్ కోర్సుకు మాత్రం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులే అర్హులు.

## ప్రవేశాలెప్పుడు?

- జూన్‌లో జిల్లాలవారీగా ప్రవేశ ప్రకటనలు వెలువరిస్తారు.
- జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రవేశాలు నిర్వహిస్తారు.
- ఇంటర్మీడియట్‌లోని మార్కుల ప్రాతిపదికనే ప్రవేశ ప్రక్రియ కొనసాగుతుంది.
- ఎంపికైన అభ్యర్థుల జాబితాను పారామెడికల్ బోర్డుకు పంపిస్తారు.
- ఆ జాబితాను బోర్డు ధ్రువీకరించిన అనంతరమే ఈ-పాస్ విధానంలో రుసుములు చెల్లిస్తారు.
- సెప్టెంబరులో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది.

**రుసుములెలా?:** ఈ వృత్తి విద్య కోర్సుల్లో చదివేది అత్యధికులు నిరుపేద విద్యార్థులే కావడంతో.. వీరికి ప్రభుత్వమే రుసుమును ఆన్‌లైన్ విధానంలో చెల్లిస్తోంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివినా.. ప్రైవేటులోనూ కన్వీనర్ కోటాలో చదివినా.. మొత్తం రుసుమును సర్కారే భరిస్తోంది. వీరికి ఏడాదికి రూ. 6 వేలు ప్రభుత్వ కళాశాలల్లో, రూ. 13 వేలు ప్రైవేటు కళాశాలల్లో రుసుము ఉంటుంది. వీరికి రెండేళ్లకోసారి వార్షిక పరీక్షలను నిర్వహిస్తుంటారు. ఆ పరీక్ష రుసుము రూ. 1500 కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రైవేటు కళాశాలల్లో యాజమాన్య కోటా కింద ఏడాదికి రూ. 40 వేల రుసుమును నిర్ణయించారు. కానీ ఆ సీట్లలో చేరికలు బహు స్వల్పం.

**మెరుగైన అవకాశాలు:** ఇంజినీరింగ్ చదివినా కూడా ఉద్యోగావకాశాలు తక్కువగా ఉన్నాయేమో గానీ.. పారామెడికల్ కోర్సుల్లో డిప్లొమా కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు మాత్రం సమాజంలో మెరుగైన అవకాశాలే లభిస్తున్నాయి. ఉదాహరణకు ల్యాబ్‌టెక్నీషియన్ చేసిన అభ్యర్థి ప్రభుత్వ రంగంలోనే ఉద్యోగం చేయాలనేం లేదు. ప్రైవేటులోనూ బోలెడన్ని అవకాశాలున్నాయి. ఏ ప్రైవేటు ఆసుపత్రులోనైనా, ఏ ప్రయోగశాలలోనైనా ల్యాబ్ టెక్నీషియన్‌గా చేరిపోవచ్చు. ఇక్కడ వీరికి డిమాండ్ ఎక్కువ. నెలకు కనీసం రూ. 20 వేల వేతనంతో చేరిపోతున్నారు.

అలాగే అనెస్తీషియా, పర్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ తదితర విభాగాల్లో సాంకేతిక నిపుణులకు విదేశాల్లోనూ ఎక్కువ గిరాకీ ఉంది. మన దగ్గర పారామెడికల్ కోర్సుల్లో డిప్లొమా చేసిన అనేకమందికి విదేశాల్లో ఇక్కడి కంటే ఐదింతలు అధికంగా వేతనం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం 'కంటి వెలుగు' పేరిట పెద్ద ఎత్తున నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించనున్న నేపథ్యంలో.. ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్లు, ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్లకు ఆదరణ పెరగనుంది.

ఇప్పటికే నేత్ర వైద్యంలో సాంకేతిక శిక్షణ పూర్తిచేసుకున్న సుమారు 700 మంది నిపుణులను కంటి వెలుగులో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు.

తెలంగాణ ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా ప్రారంభించనున్న డెంటల్ హైజీనిస్ట్, ఎమర్జెన్సీ పారామెడిక్ టెక్నీషియన్ తదితర పారామెడికల్ కోర్సులు, కళాశాలల వివరాలను www.eenadupratibha.net లోచూడవచ్చు.

*- అయితరాజు రంగారావు, ఈనాడు, హైదరాబాద్*

### ఆంధ్రప్రదేశ్‌లో...

ఆంధ్రప్రదేశ్‌లోని 8 ప్రభుత్వ పారా మెడికల్ కళాశాలల్లో 14 రకాల పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో 864 సీట్లున్నాయి. కోర్సులవారీగా చూస్తే...

| కోర్సు | సీట్లు |
|---|---|
| మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ | 210 |
| మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ | 80 |
| ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు | 50 |
| డయాలసిస్ టెక్నాలజీ | 20 |
| రెస్పిరేటరీ థెరపీ | 25 |
| మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ | 10 |
| పర్‌ఫ్యూజన్ టెక్నాలజీ | 30 |
| రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ కోర్సు | 49 |
| డార్క్‌రూమ్ అసిస్టెంట్ కోర్సు | 33 |
| కార్డియాలజీ టెక్నీషియన్ కోర్సు | 40 |
| క్యాథ్‌ల్యాబ్ టెక్నాలజీ | 16 |
| ఈసీజీ | 51 |
| అనెస్తీషియా టెక్నీషియన్ కోర్సు | 240 |
| ఆడియోమెట్రీ టెక్నీషియన్ కోర్సు | 10 |

205 ప్రైవేటు పారా మెడికల్ కళాశాలల్లో 7755 సీట్లు ఉన్నాయి. (ఇవి 2017-18 వివరాలు).
http://dme.ap.nic.in, www.appmb.org.in

### తెలంగాణ కాలేజీలు, కోర్సులు

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అందుబాటులో ఉన్న పారామెడికల్ డిప్లొమా కోర్సులివి..

- తెలంగాణలో మొత్తం ప్రైవేటు పారామెడికల్ కళాశాలలు 250
- మొత్తం సీట్లు 33456
- ప్రభుత్వ రంగంలో 9 వైద్యకళాశాలలు.. మొత్తం సీట్లు 591
- కాకతీయ వైద్యకళాశాల
- ఉస్మానియా వైద్యకళాశాల
- ప్రభుత్వ ప్రసూతి దవాఖానా పేట్లబురుజు
- ఛాతీ ఆసుపత్రి
- ఉస్మానియా విశ్వవిద్యాలయ మహిళా కళాశాల
- గాంధీ వైద్యకళాశాల
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్
- ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి
- సరోజినీదేవి కంటి ఆసుపత్రి.

**కోర్సులు:** ■ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ ■ ఆప్టోమెట్రీ టెక్నీషియన్ ■ హాస్పిటల్ ఫుడ్‌సర్వీస్ మేనేజ్‌మెంట్ ■ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) ■ ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ ■ ఆడియోమెట్రీ ■ రేడియోథెరపీ ■ పర్‌ఫ్యూజన్ ■ డయాలసిస్ ■ మెడికల్ ఇమేజింగ్ ■ రెస్పిరేటరీ థెరపీ ■ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ ■ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్ థెరపీ ■ డెంటల్ ■ డెంటల్ హైజీనిస్ట్ ■ మైక్రోసర్జరీ ■ అనెస్తీషియా ■ క్యాథ్‌ల్యాబ్ ■ రేడియోగ్రాఫిక్ అసిస్టెంట్ ■ డార్క్‌రూమ్ అసిస్టెంట్ ■ ఈసీజీ ■ కార్డియాలజీ



### ఈ ఏడాది నుంచే సీట్ల పెంపు



ఈసారి ప్రవేశ ప్రకటన జారీ చేసేటప్పుడు పారామెడికల్ కోర్సులకు సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించాం. ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నాం. ప్రభుత్వ కళాశాలల్లో 591 డిప్లొమా సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ నిజానికి సీట్ల సంఖ్యను పెద్దసంఖ్యలో పెంచుకోవడానికి అవసరమైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలున్నాయి. అందుకే ప్రభుత్వ వైద్యంలో అదనంగా 958 పారామెడికల్ డిప్లొమా సీట్లను పెంచే ప్రతిపాదనను ఇప్పటికే ప్రభుత్వానికి అందజేశాం. త్వరలోనే దీనిపై సానుకూల నిర్ణయం రానుంది.

ఈ విద్యా సంవత్సరం నుంచే పెంచిన సీట్లను ప్రవేశ ప్రక్రియలో పొందుపరుస్తాం. ప్రస్తుతం రెండేళ్లకోసారి వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. వీటిని ప్రతి సంవత్సరం నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఆధునిక వైద్యంలో వస్తున్న మార్పులకనుగుణంగా పాఠ్యాంశాల్లోనూ మార్పులు తీసుకురానున్నాం. విదేశాలకు వెళ్లేముందు పారామెడికల్ బోర్డులో మంచి ప్రవర్తనకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుంది. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత ప్రమాణాలు పరిరక్షించడంపైనా దృష్టిపెట్టాం. ప్రయోగశాలలు, బోధన అర్హులతో నిర్వహిస్తున్నారా? లేదా? అనేది పరిశీలిస్తాం. లోటు ఉన్నవారిపై చర్యలు తీసుకుంటాం.

***టి.గోపాలరెడ్డి,*** తెలంగాణ పారామెడికల్ బోర్డు కార్యదర్శి

### తెలంగాణ ప్రభుత్వ వైద్యకళాశాలల్లో పెంచనున్న పారామెడికల్ కోర్సుల సీట్ల వివరాలు

| కోర్సు | ప్రస్తుత సీట్లు | పెంచనున్న సీట్లు | మొత్తం సీట్లు |
|---|---|---|---|
| మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ | 195 | 80 | 275 |
| ఆప్టోమెట్రీ టెక్నీషియన్ | 17 | 13 | 30 |
| ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ | 32 | 58 | 90 |
| రేడియోథెరపీ టెక్నీషియన్ | 10 | 20 | 30 |
| డయాలసిస్ టెక్నీషియన్ | 20 | 30 | 50 |
| మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ | 45 | 70 | 115 |
| మెడికల్ స్టెరిలైజేషన్ టెక్నీషియన్ | 20 | 10 | 30 |
| అనెస్తీషియా టెక్నీషియన్ | 110 | 70 | 180 |
| రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ | 28 | 10 | 38 |

**వెబ్‌సైట్:** www.tspmb.telangana.gov.in

## ఎథికల్ హ్యాకింగ్ చదవాలంటే?

» మా అబ్బాయి బీటెక్ (సీఎస్ఈ) రెండో సంవత్సరం చదువుతున్నాడు. తనకు ఎథికల్ హ్యాకింగ్‌పై ఆసక్తి. అందించే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వివరాలను అందించండి.

*- రవిప్రసాద్ ఆత్కూరి*

**జ:** హానికర హ్యాకర్లు చేయదలచుకునే దుశ్చర్యలను ముందుగా పసిగట్టి, కంప్యూటర్ సమాచార వ్యవస్థల బలహీనతలను, దుర్బలాలను గుర్తించే చర్యను చట్టపరంగా సాగించడమే ఎథికల్ హ్యాకింగ్ ఉద్దేశం. కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన/ చేస్తున్నవారికి ఈ కోర్సు ఎంతగానో దోహదపడుతుంది. మన తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రైవేటు సంస్థలు ఎథికల్ హ్యాకింగ్‌లో శిక్షణ ఇస్తున్నాయి. ముఖ్యంగా ఈసీ కౌన్సిల్ వారు అందిస్తున్న సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకింగ్ కోర్సు ప్రముఖమైంది. 125 ఆబ్జెక్టివ్ ప్రశ్నల పరీక్షను నాలుగు గంటల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు www.eccouncil.org ను సందర్శించవచ్చు. ఇంకా బీటెక్ రెండో సంవత్సరమే కాబట్టి, చదువు పూర్తయ్యేలోపు ఈ కోర్సును చేసి, ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తే మంచిది. ప్రస్తుతానికి ఈ కోర్సు ప్రభుత్వ సంస్థల్లో అందుబాటులో లేదు.

## బిజినెస్ అకౌంటింగ్ & టాక్సేషన్

» బిజినెస్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సులను అందిస్తున్న సంస్థలు, వాటి ఫీజు వివరాలను తెలియజేయగలరు.

*- శ్రీజేష్ నాయర్*

**జ:** మీరు ఏం చదివారో తెలియజేయలేదు. బిజినెస్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ కోర్సులను చదవాలనుకునేవారు డిగ్రీ స్థాయిలో బీకాం (అకౌంటింగ్ అండ్ టాక్సేషన్), బీకాం (జనరల్) కోర్సులను ఎంచుకోవచ్చు. డిగ్రీతోపాటు చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) లేదా సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ) కోర్సులను చదివితే ఈ రంగంలో అవకాశాలు ఎక్కువ. డిగ్రీ పూర్తిచేసినవారు సీఎంఏ-యూఎస్ కోర్సును ఎంచుకుని బిజినెస్ అకౌంటింగ్ అండ్ టాక్సేషన్ రంగంలో స్థిరపడొచ్చు. సాధారణంగా ప్రతి డిగ్రీ కళాశాలలో బీకాం కోర్సు అందుబాటులో ఉంటుంది. సీఏ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) వారు, సీఎంఏ కోర్సును ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) వారు అందిస్తున్నారు.

*- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్*



## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

#### ఎయిమ్స్, న్యూదిల్లీలో 150 టీచింగ్ పోస్టులు

**సంస్థ:** ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), న్యూదిల్లీ **పోస్టులు:** అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్
**ఖాళీలు:** 150 **అర్హత:** ఎంబీబీఎస్, పీజీ, డాక్టొరేట్ డిగ్రీ, అనుభవం.
**వయసు:** 50 సంవత్సరాలకు మించకూడదు.
**ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ. 500 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 09.07.2018 **హార్డ్ కాపీలను పంపడానికి చివరి తేది:** 24.07.2018
**వెబ్‌సైట్:** www.aiimsexams.org

#### ఓఎన్‌జీసీలో మెడికల్ ఆఫీసర్లు

**సంస్థ:** ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) లిమిటెడ్, రాజమహేంద్రవరం.
**పోస్టు:** మెడికల్ ఆఫీసర్ (కాంట్రాక్టు) **ఖాళీలు:** 29 **అర్హత:** ఎంబీబీఎస్‌తోపాటు సంబంధిత స్పెషాలిటీలో 3 నెలల సర్టిఫికెట్ కోర్సు. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్
**చివరి తేది:** 18.06.2018
**వెబ్‌సైట్:** www.ongcindia.com

#### సీఐఈటీ - ఎన్‌సీఈఆర్‌టీ

**సంస్థ:** సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ (సీఐఈటీ), ఎన్‌సీఈఆర్‌టీ, న్యూదిల్లీ.
**పోస్టులు:** కంటెంట్ డెవలపర్, సిస్టమ్ అనలిస్ట్, ఐసీటీ కన్సల్టెంట్ తదితరాలు.
**ఖాళీలు:** 30
**అర్హత:** ఇంటర్, బ్యాచిలర్/ మాస్టర్స్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం. **ఎంపిక:** స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఈ-మెయిల్.
**చివరి తేది:** 24.06.2018.
**ఈ-మెయిల్:** pmd.ciet@gmail.com
**వెబ్‌సైట్:** http://www.ciet.nic.in/

#### ముంబయి పోర్టు ట్రస్టులో ఖాళీలు

**పోస్టులు:** అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అకౌంట్ ఆఫీసర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.
**ఖాళీలు:** 26
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం.
**ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
**చివరి తేది:** 07.07.2018.
**వెబ్‌సైట్:** http://mumbaiport.gov.in/

### ప్రవేశాలు

#### సీడ్యాక్, హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సు

**సంస్థ:** సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్), హైదరాబాద్
**కోర్సు:** డిప్లొమా ఇన్ మోడర్న్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఎసన్షియల్స్ (డీఎంఎస్‌డీఈ). **కాలవ్యవధి:** 5 నెలలు
**సీట్లసంఖ్య:** 60 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్/ నాలుగేళ్ల బీఎస్సీ ఇంజినీరింగ్/ ఏఎంఐఈ/ ఇంజినీరింగ్ సైన్సెస్‌లో పీజీ/ ఎంసీఏ ఉత్తీర్ణత. **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్
**చివరి తేది:** 11.07.2018 **వెబ్‌సైట్:** https://cdac.in/

#### నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం ప్రోగ్రామ్

**సంస్థ:** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్), హైదరాబాద్. **కోర్సు:** మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఎం). **కాలవ్యవధి:** 2 సంవత్సరాలు + 6 నెలలు ఇంటర్న్‌షిప్. **సీట్ల సంఖ్య:** 20 **అర్హత:** మెడికల్/ నాన్ మెడికల్ కోర్సుల్లో ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. **వయసు:** 20-30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, వైవా ఆధారంగా. **పరీక్ష తేది:** 16.07.2018 **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ. 1100.
**చివరి తేది:** 30.06.2018 **వెబ్‌సైట్:** https://nims.edu.in/

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

#### ఎన్‌సీడీఐఆర్, బెంగళూరు

**సంస్థ:** ఐసీఎంఆర్-నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్స్ అండ్ రిసెర్చ్ (ఎన్‌సీడీఐఆర్), బెంగళూరు. **పోస్టులు:** సైంటిస్ట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితర కాంట్రాక్టు పోస్టులు. **ఖాళీలు:** 20 **అర్హత, వయసు:** ఎన్‌సీడీఐఆర్ నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ ద్వారా. **నియామక పరీక్షల తేదీలు:** 2018 జూన్ 26-28 **వేదిక:** ఎన్‌సీడీఐఆర్, బెంగళూరు. **వెబ్‌సైట్:** www.ncdirindia.org

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు